
సాక్షి కర్నూలు
గురువారం • 5 • జూన్ • 2025



శ్రీశైలంలో హైకోర్టు జడ్జి

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల దర్శనార్థం బుధవారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుమతి శ్రీశైలం చేరుకున్నారు.



వనదేవత క్షోభ

నంద్యాల(న్యూటౌన్): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ చేతిపై వనదేవత క్షోభ చిత్రాన్ని వేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,599.48
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 20.921
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 8,222
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 247

న్యూస్‌రీల్

నేడు వనమహోత్సవం

కర్నూలు కల్చరల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో గురువారం వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా అటవీ శాఖ అధికారిణి పి.శ్యామల తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 4.20 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం ఉదయం 10 గంటలకు కర్నూలు సిటీ ఫారెస్ట్‌లో జరిగే కార్యక్రమంలో 500 మొక్కలు నాటనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, కర్నూలు సర్కిల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ యశోదాబాయి, ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు.

జెడ్పీ పరిధిలో 64 మంది బదిలీ

కర్నూలు(అర్బన్): జిల్లాపరిషత్ పరిధిలోని వివిధ మండల పరిషత్, ఇంజనీరింగ్ కార్యాలయాలు, జిల్లాపరిషత్ హైస్కూల్స్, జెడ్పీలో విధులు నిర్వహిస్తున్న వివిధ కేడర్లకు చెందిన 64 మంది ఉద్యోగులను బదిలీ చేసినట్లు జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలకు సంబంధించి విడుదల చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఒకే ప్రాంతంలో ఐదేళ్లకు పైగా విధులు నిర్వహిస్తున్న, రిక్వెస్ట్ కోరిన వారి దరఖాస్తులను ఈనెల 1వ తేదీన జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి కౌన్సిలింగ్ నిర్వహించారని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బదిలీ అయిన వారందరికీ ఉత్తర్వులు జారీ చేశామని సీఈఓ తెలిపారు.

వైభవంగా వాదీంద్రతీర్థుల ఆరాధన



మూలబృందావనానికి హారతులు పడుతున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం: రాఘవేంద్రస్వామి ముని మనవడు, శ్రీమఠం పూర్వ పీఠాధిపతి వాదీంద్రతీర్థుల ఆరాధన వేడుక వైభవంగా నిర్వహించారు. బుధవారం శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల నేతృత్వంలో వేడుకలు కనుల పండువగా చేపట్టారు. ముందుగా వాదీంద్రుల మూల బృందావనానికి నిర్మాల్య విసర్జన, ఫల, పూల, గంధ, పంచామృతాభిషేకాలు గావించారు. వేద పఠనం మధ్య ఎంతో పవిత్రంగా శాస్త్రోక్తంగా పూజోత్సవాలు నిర్వహించారు. అలాగే వాదీంద్రుల బృందావన ప్రతిమను స్వర్ణ రథంపై కొలువుంచి పీఠాధిపతి హారతులు పట్టి రథయాత్రకు అంకురార్పణ పలికారు. శ్రీమఠం ప్రాంగణ వీధుల్లో అశేష జనవాహిని మధ్య రథయాత్ర రమణీయంగా సాగింది. వేడుకలో మేనేజర్లు శ్రీనివాసరావు, శ్రీపతి ఆచార్, వెంకటేష్‌జోషి తదితరులు పాల్గొన్నారు.

పండుగలు సోదర భావంతో జరుపుకోవాలి

- పీస్ కమిటీ సమావేశంలో మత పెద్దలకు ఎస్పీ సూచన



మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు: కుల, మతాలకు అతీతంగా సోదరభావంతో పండుగలు జరుపుకోవాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈనెల 7న బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా వివిధ వర్గాలకు చెందిన సామాజిక మత పెద్దలతో జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో ఎస్పీ శాంతియుత సమావేశం నిర్వహించారు. ఒకరినొకరు గౌరవించుకోవాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే ఉపేక్షించేది లేదన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మకూడదని, అందరూ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలన్నారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే డయల్ 100, లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా మాట్లాడుతూ సుహృద్భావ వాతావరణం కల్పించడానికి మతపెద్దలందరూ కృషి చేయాలన్నారు. అందరూ సమిష్టిగా ఉంటూ బక్రీద్ పండుగ, త్వరలో వచ్చే వినాయక చవితి పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. కర్నూలు తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలాజీ నగర్-స్టాంటన్‌పురం మధ్యలో పోలీస్ ఔట్‌పోస్టు ఏర్పాటు చేయాలని మతపెద్దలు ఎస్పీకి విన్నవించారు. కర్నూలు ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీనివాసాచారి, మత పెద్దలు, ప్రభుత్వ ఖాజీ మౌలానా షేక్ అబ్దుల్ సలాం, మౌలానా సయ్యద్ జాకీర్, అహ్మద్ రషాది, సందడి మహేష్, గోరంట్ల రమణ, ఇంతియాజ్ ఖాన్, షానవాజ్, సీఐలు తేజామూర్తి, కేశవరెడ్డి, రామయ్య నాయుడు, నాగరాజ రావు పాల్గొన్నారు.



మంత్రాలయంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనకు భారీగా తరలివచ్చిన ప్రజలు



ఎమ్మిగనూరులో ప్రజలతో కలసి ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు బుట్టా రేణుక, ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డి, పార్టీ నాయకులు

నిరసన హోరెత్తి.. వెన్నుపోటుపై గళమెత్తి!

కదంతొక్కిన వైఎస్సార్‌సీపీ

- కూటమి ప్రభుత్వ తీరుపై జిల్లావ్యాప్త నిరసనలు
- ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజల ఆగ్రహం
- భారీ ఎత్తున బైక్ ర్యాలీలు
- స్వచ్ఛంద మద్దతు తెలిపిన మహిళలు
- సూపర్‌సిక్స్ హామీలు అమలు చేసే వరకు వదిలేది లేదని ప్రతిన

కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజా వ్యతిరేకత మిన్నంటింది. సూపర్ సిక్స్ పేరిట అన్ని వర్గాల ప్రజలకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు తీరుపై నిరసన హోరెత్తింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపులో భాగంగా జిల్లా వ్యాప్తంగా చేపట్టిన వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ ప్రభుత్వంపై ప్రజాగ్రహానికి అద్దం పట్టింది. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున కార్యక్రమాల్లో పాల్పంచుకోగా.. ప్రజలు, ముఖ్యంగా మహిళలు రోడ్డెక్కి మద్దతు పలికారు. ఎక్కడికక్కడ మోటార్ సైకిళ్లతో ర్యాలీలు నిర్వహిస్తూ.. సీఎం డౌన్‌డౌన్ ప్లకార్డులను ప్రదర్శించారు. ఆయా నియోజకవర్గాల్లో వలంటీర్లు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. కర్నూలులో ఎండీయూ వాహన ఆపరేటర్లు తమ వాహనాలతో నిరసన ర్యాలీలో మద్దతు తెలిపారు. – కర్నూలు(టౌన్)



ఆలూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ప్రజలతో కలసి ర్యాలీగా చేస్తున్న ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి, పార్టీ నాయకులు, కార్యకర్తలు

ఏడాదంతా రెడ్ బుక్ పాలనే..

రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన తప్ప కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయలేకపోయిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు పార్లమెంట్ పరిశీలకులు గంగుల ప్రభాకర్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంపై పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం జిల్లా వ్యాప్తంగా వెన్నుపోటు నిరసన దినం చేపట్టారు. కర్నూలు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పార్టీ శ్రేణులతో పాటు ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నగరంలోని ధర్నా చౌక్ నుంచి బుధవారపేట, కర్నూలు ప్రభుత్వాసుపత్రి, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా కలెక్టరేట్‌కు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా గంగుల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పాలన అట్టర్ ఫ్లాప్ అయ్యిందన్నారు. ఎలాగైనా అధికారంలోకి రావాలనే ఉద్దేశంతో కూటమి నేతలు ఆచారణ సాధ్యం కాని హామీలు ఇచ్చారన్నారు. ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఒక్కటంటే ఒక్క హామీ కూడా నెరవేర్చలేకపోయారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబును ఏ ఒక్కరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం గ్రామాల్లో మరింత వ్యతిరేకత ఉందని, కూటమి నేతలు ప్రజల్లో తిరిగే పరిస్థితి లేదన్నారు. ఎక్కడికక్కడ తిరగబడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ర్యాలీ అనంతరం వైఎస్సార్‌సీపీ నేతలు కలెక్టరేట్‌లో డీఆర్ఓ వెంకట నారాయణమ్మకు వినతిపత్రం అందజేశారు.



పత్తికొండ నాలుగు స్తంభాల కూడలిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

జిల్లా వ్యాప్తంగా నిరసనలు

మంత్రాలయం: ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి నిరసన ర్యాలీలో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం చేరుకొని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అధికార ప్రతినిధి పురుషోత్తం రెడ్డి, ప్రదీప్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు: ఎమ్మెల్యే బి.విరూపాక్షి వెన్నుపోటు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.

పాణ్యం: కల్లూరులో నంద్యాల పార్టీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి, కర్నూలు నగర మేయర్ బి.వై.రామయ్యతో కలిసి వెన్నుపోటు నిరసన ర్యాలీ పెద్ద ఎత్తున చేపట్టారు. కల్లూరులోని తన స్వగృహం నుంచి పార్టీ శ్రేణులతో కలిసి తహసీల్దారు కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

ఆదోని: పట్టణంలో వెన్నుపోటు నిరసన కార్యక్రమం ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. భారీగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించి సబ్ కలెక్టర్‌ను వినతిపత్రం అందజేశారు.

పత్తికొండ: మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం భారీ ఎత్తున నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

కోడుమూరు: నియోజకవర్గంలోని గూడురులో పార్టీ సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సతీష్‌ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం నిర్వహించారు. మాజీ కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ పాల్గొన్నారు. పాతబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఎమ్మిగనూరు: పట్టణంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టా రేణుకా ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.



కల్లూరులో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి, మేయర్ బీవై రామయ్య, కార్పొరేటర్లు, కార్యకర్తలు



మంత్రాలయం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు



కర్నూలు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్వీ మోహన్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్, గంగుల ప్రభాకర్ రెడ్డి తదితరులు

పోరాటాన్ని కొనసాగిస్తాం

చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చేందుకు సూపర్ సిక్స్ పథకాల పేరిట ప్రజలను మోసం చేశాడు. రూ.1.60 లక్షల కోట్లు అప్పు చేసి రాష్ట్రంలో ఏ ఒక్కరికీ రూ.1000లు కూడా సంక్షేమ పథకాల కింద ఇవ్వలేకపోయాడు. మరి అంత డబ్బు ఏం చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలి. ఏడాది గడిచినా ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం వల్లే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెన్నుపోటు నిరసన దినం చేపట్టింది. నిరసనలను ఇంతటితో ఆపం.. ప్రజలతో కలిసి ఇక మీదట కూడా చంద్రబాబు మెడలు వంచేందుకు పోరాటాన్ని కొనసాగిస్తాం.

– ఎస్వీ మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు

చంద్రబాబు నైజం ప్రజలకు తెలిసిపోయింది

ఏడాది గడిచినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ చంద్రబాబు నెరవేర్చలేకపోయారు. తాము మోసపోయామనే విషయం ప్రజలకు ఇప్పటికే అర్థమైంది. కూటమి నాయకులు ప్రజల వద్దకు వెళితే తిరగబడటం ఒక్కటే మిగిలింది. పోలీసులను అడ్డం పెట్టుకొని కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోంది.

– మధుసూదన్, ఎమ్మెల్సీ

సంక్షేమ పథకాల కోసం ఎదురుచూసినట్లుంది



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చెప్పింది చెప్పినట్లు చూసి చూపించారు. ఈ ప్రభుత్వం అంతకంటే గొప్పగా చేస్తామని చెప్పడంతో ఓట్లేశాం. ఇప్పుడు చూస్తే ఒక్కటంటే ఒక్క పథకం కూడా ప్రజలకు అందింది లేదు. సంవత్సరమైనా ఎదురుచూడటంతోనే సరిపోతుంది. సూపర్‌సిక్స్ పథకాలని చెప్పి ప్రజలందరినీ మోసం చేసినారు. ఈ నాయకులకు మళ్లీ మా దగ్గరికి రావాలంటే మొహం ఎలా వస్తుంది. బుద్ధి ఉంటే ఇంకోసారి నమ్ముతామా?.

– దస్తగిరి, హాలహర్వి గ్రామం, నందవరం మండలం

పాలన అంతా అరాచకమే!

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): రాష్ట్రంలో 'కూటమి' ఏడాది పాలనంతా అరాచకమేనని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆరోపించారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి తరఫున వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందని తెలిపారు. కల్లూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం 'వెన్నుపోటు దిన నిరసన' నిర్వహించారు. తహసీల్దార్ ఆంజనేయులకు వినతిపత్రం సమర్పించారు. అంతకు ముందు కాటసాని ఇంటి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయన్నారు. పోలీసులు టీడీపీ కార్యకర్తలుగా పనిచేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా చంద్రబాబు, పవన్ కల్యాణ్.. ఊరూరా మద్యాన్ని తెచ్చి మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని విమర్శించారు. టీడీపీ నాయకులు ఇసుకను కొల్లగొడుతున్నారని విమర్శించారు.

- మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ.. కూటమి ఏడాది పాలనంతా అరాచకాలతో సరిపోయిందన్నారు. డిప్యూటీ మేయర్ రేణుకారెడ్డి సిద్ధారెడ్డి, మైనార్టీ నాయకులు యూనస్‌బాషా మాట్లాడుతూ.. ప్రజలను మోసం చేస్తున్న చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో భంగపాటు తప్పదన్నారు. కార్పొరేటర్లు లక్ష్మణ్, అరుణకుమారి, లక్ష్మీకాంతరెడ్డి, నారాయణరెడ్డి, సుదర్శన్ రెడ్డి, చిట్టెమ్మ, సాన శ్రీనివాసులు, నరసింహులు, ఎరుకల వెంకటేశ్వర్లు, శ్వేతారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రారెడ్డి, రంగమునిగౌడ్, ఎంపీపీలు శారద,తిప్పన్న, నాగమద్దమ్మ, ఉసేన్, పార్టీ నాయకుల అంబాల ప్రభాకరరెడ్డి, బెల్లం మహేశ్వరరెడ్డి, నల్లబోతుల గోపాల్‌రెడ్డి, అక్కిమి అనుమంతరెడ్డి పాల్గొన్నారు.



ఆదోనిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి



కర్నూలు నగరంలో నిర్వహించిన ర్యాలీలో ట్రాక్టర్ నడుపుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి



గూడూరులో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు

క్లుప్తంగా

ఆటలాడుకుంటూ అనంతలోకాలకు..

● బావిలో పడి బాలుడి మృతి


మృతిచెందిన బాలుడు ధనుష్ (ఫైల్)

దేవనకొండ: ఆటలాడుకుంటూ ప్రమాదవశాత్తూ పదేళ్ల బాలుడు బావిలో పడి మృతిచెందాడు. ఈ దుర్ఘటన నల్లచెలిమల గ్రామ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వీరేష్, కమల దంపతులు సొంత ఊరిలో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. పొలం పనులకు వెళ్తూ తమ ఇద్దరు పిల్లల్ని కూడా తమ వెంట తీసుకెళ్లారు. తల్లిదండ్రులు పనిలో నిమగ్నమై ఉండగా పక్క పొలంలో పిల్లలతో కలిసి ధనుష్(10) అనే బాలుడు ఆటలాడడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తూ ధనుష్ బావిలో కాలు జారి పడిపోగా, తోటి పిల్లలు కేకలు వేశారు. తల్లిదండ్రులు వచ్చి పిల్లవాడిని బయటికి తీసేలోపు మృతిచెందాడు. బాలుడి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

మహిళ ఆత్మహత్య

కోవెలకుంట్ల: పట్టణంలోని గుద్దేటి వీధిలో నివాసం ఉంటున్న ఓ మహిళ బుధవారం బలవన్మరణానికి పాల్పడింది. ఎస్ఐ మల్లికార్జున రెడ్డి అందించిన సమాచారం మేరకు.. కాలనీకి చెందిన అరుణ(51) కుటుంబ సమస్యల కారణంగా మనస్తాపం చెంది క్రిమి సంహారక మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన బంధువులు చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. మృతురాలి కుమారుడు వినయ్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పనుల్లేక.. ఉరికి వేలాడి!


సంజీవులు (ఫైల్)

వెల్దుర్తి: కుటుంబ పోషణకు పనిచేద్దామన్నా ఎవరూ ఇవ్వకపోవడంతో ఓ వ్యక్తి ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. వెల్దుర్తి పట్టణం 15వ వార్డులో మల్లిపల్లి సంజీవులు(47) నివాసముంటున్నాడు. కూలీ పనులతో జీవనం సాగించే ఈయనకు భార్య మల్లేశ్వరి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఏడాది క్రితం వివాహమైన కుమార్తెను చూసేందుకు మంగళవారం భార్య, కుమారుడు వెంకట్రాంపల్లె వెళ్లారు. బుధవారం తిరిగి రాగా సంజీవులు ఉరితాడుకు వేలాడుతూ కనిపించాడు. కూలీ పనులు దొరకక, ఆర్థిక ఇబ్బందుల వల్లే తన భర్త ఆత్మహత్యకు పాల్పడ్డట్టు మల్లేశ్వరి పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.

క'రుణ' చూపుతూ.. 'ఉపాధి' కల్పిస్తూ..

● యువతకు ఆశాకిరణంగా కెనరాబ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ
● ఉచిత భోజన వసతి, హాస్టల్ సదుపాయం
● ఇప్పటి వరకు 9,342 మందికి శిక్షణ.. 3,701 మందికి రుణాలు
● కొత్తగా పురుషులకు ఫోర్ వీలర్ డ్రైవింగ్‌లో శిక్షణ


టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న మహిళలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువతకు కెనరాబ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంటు ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్-ఆర్ఎస్ఈటీఐ) అండగా నిలిచింది. నాణ్యమైన ఉచిత శిక్షణ ఇవ్వడంతోపాటు హాస్టల్ వసతి కల్పిస్తోంది. స్వయం ఉపాధిలో రాణించేందుకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కూడా కల్పిస్తోంది. కెనరాబ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ 2023 ఆగస్టు 5న ఆవిర్భవించింది. కొద్ది నెలల క్రితం వరకు కల్లూరు మండల తహసీల్దారు కార్యాలయం దగ్గర ఉన్నా కెనరా బ్యాంకు 3వ అంతస్తులో నిర్వహించేవారు. శిక్షణ కార్యక్రమాలను మరింత పెద్ద ఎత్తున చేపట్టాలనే లక్ష్యంతో బి.తాండ్రపాడు సమీపంలో డీఆర్‌డీఏ ట్రెనింగ్ సెంటరు పక్కన సొంత భవనాన్ని నిర్మించారు. 2024–25లో 35 బ్యాచ్‌లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఒక్కో బ్యాచ్‌లో గరిష్టంగా 35 మంది ప్రకారం 1,225 మందికి శిక్షణ ఇచ్చారు. ఈ ఏడాది 44 బ్యాచ్‌లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధమైంది. ఒక బ్యాచ్‌కి శిక్షణ ఇవ్వాలంటే కెనరా బ్యాంకు రూ.2లక్షల వరకు భరిస్తోంది.

శిక్షణ ఇచ్చే అంశాలు పురుషులకు..

2వీలర్ మోటర్‌సైకిల్ సర్వీసింగ్/రిపేరీ, సెల్‌ఫోన్ సర్వీసింగ్, ఫొటోగ్రఫీ -వీడియోగ్రఫీ, ఎలక్ట్రికల్ హోమ్ వైరింగ్, ప్లంబింగ్-శానిటరీ, ఎలక్ట్రికల్ మోటర్ రీవైండింగ్- పంపుసెట్ రిపేరి, టైలరింగ్ అండ్ డ్రస్ డిజైనింగ్ ఫర్‌మెన్, సీసీటీవీ కెమెరా ఇన్‌స్టలేషన్, సర్వీసింగ్, కంప్యూటరైజ్డ్ అకౌంటింగ్(ట్యాలీ), పుట్టగొడుగుల తయారీ, గొర్రెల పెంపకంలో శిక్షణ ఇస్తారు. కొత్తగా 4 వీలర్ డ్రైవింగ్‌లో కూడా శిక్షణ ఇస్తున్నారు.

శిక్షణ ఇచ్చే అంశాలు మహిళలకు..

టైలరింగ్ అండ్ డ్రస్ డిజైనింగ్, బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంటు/పెళ్లికూతురు మేకప్/మెహంది వర్క్, జ్యూట్‌బ్యాగ్ తయారీ/కూరగాయల బ్యాగుల తయారీ, వస్త్ర చిత్ర కళా ఉద్యమి(జర్దోషి, మగ్గం వర్క్, ఫ్యాబ్రిక్ పెయింట్స్), అగరుబత్తిల తయారీ, కొవ్వొత్తుల తయారీ కంప్యూటరైజ్డ్ అకౌంటింగ్(ట్యాలీ), పచ్చళ్లు, బేకరీ ఉత్పత్తులు, మసాల పౌడర్ల తయారీలో శిక్షణ ఇస్తారు.

ఇవీ సౌకర్యాలు

- కంప్యూటరైజ్డ్ అకౌంటింగ్(ట్యాలీ)లో శిక్షణ పొందేందుకు డిగ్రీ అర్హత కలిగి ఉండాల్సి ఉంది. మిగిలిన కనీస విద్యార్హత 10 వతరగతి ఉంటే చాలు. 18 నుంచి 45 ఏళ్లలోపు వారందరు అర్హులే.
- ఉమ్మడి జిల్లా యూనిట్‌గా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.
- మహిళలు శిక్షణ పొందే సమయంలో పురుషులు ఉండరు. పురుషులు శిక్షణ పొందే సమయంలో మహిళలు ఉండరు.
- ప్రతి రోజు రోజుకు ఒక్కో రకం అల్పాహారం, మధ్యాహ్నం భోజనంలో ప్రతి రోజు గుడ్డు, రాత్రి భోజనంలో ప్రతి రోజూ అరటి పండు ఇస్తారు. భోజనంతో పాటు హాస్టల్ వసతి కూడా కల్పిస్తున్నారు.


ఉపాధి శిక్షణ కేంద్రం



ఈ చిత్రంలో కనిపించే యువతి పేరు పి.హసీనా బేగం. కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో 30 రోజుల పాటు బ్యూటీపార్లర్‌లో శిక్షణ పొందారు. శిక్షణ పొందినట్లు సంస్థ సర్టిఫికెట్ కూడా ఇచ్చింది. శిక్షణ పొంది బ్యూటీ పార్లర్‌లో ఈమె జాబ్ చేస్తున్నారు.

ఈ చిత్రంలోని మహిళ పేరు ఉమాదేవి. బేతంచెర్లకు చెందిన ఈ మహిళ టైలరింగ్‌లో 30 రోజుల శిక్షణ పొందారు. శిక్షణ పొందిన తర్వాత కర్నూలులో టైలర్ షాపు పెట్టుకున్నారు. నెలకు రూ.25 వేల వరకు ఆదాయం పొందుతున్నారు.





ఈ మహిళ పేరు శోభారాణి. కర్నూలులో నివాసం ఉంటున్నారు. డిగ్రీ పూర్తి చేసిన ఈ మహిళ బ్యూటీ పార్లర్‌లో శిక్షణ పొందారు. శిక్షణ తర్వాత బ్యాంకు రుణసదుపాయం కల్పించింది. ఈమె కర్నూలులో బ్యూటీపార్లర్‌ఏర్పాటు చేసుకున్నారు. నెలకు అన్ని ఖర్చులు పోనూ రూ.30 వేల వరకు నికరాదాయం పొందుతున్నారు.


శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు ఇస్తున్న దృశ్యం

బ్యాంకుల రుణాలు

గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు కెనరాబ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. శిక్షణ ఇవ్వడంతో పాటు కేంద్ర ప్రభుత్వం తరఫున సర్టిఫికెట్ కూడా ఇస్తోంది. ఈ సర్టిఫికెట్‌తో బ్యాంకుల్లో రుణ సదుపాయం పొందవచ్చు. ఇప్పటి వరకు 354 బ్యాచ్‌లకు సంబంధించి 9342 మందికి శిక్షణ ఇచ్చారు. ఇందులో 6,671 మంది ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవడం ద్వారా జీవితంలో స్థిరపడ్డారు. 3,701 మందికి కెనరా బ్యాంకుతో పాటు బ్యాంకులు రుణ సదుపాయం కూడా కల్పించాయి.

'పది' చదివిన వారికి అవకాశం

కెనరాబ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థతో ఉమ్మడి జిల్లా యూనిట్‌గా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పూర్తిగా గ్రామీణ ప్రాంత యువతీ యువకులకే అవకాశం కల్పిస్తున్నాం. శిక్షణ పొందిన తర్వాత బ్యాంకుల నుంచి రుణాలు కూడా ఇప్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఒక్కో ప్రోగ్రామ్‌లో 35 మందికి అవకాశం కల్పిస్తున్నాం. ప్రస్తుతం 10 తరగతి చదివిన వారికి మాత్రమే అవకాశం కల్పిస్తున్నాం.

– పుష్పక్‌కుమార్, డైరెక్టర్, కెనరాబ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ, కర్నూలు

ప్రకృతి వ్యవసాయాన్ని ఉద్యమ తరహాలో చేపడుదాం


కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఏవో వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): ప్రకృతి వ్యవసాయాన్ని ఈ ఏడాది ఉద్యమ తరహాలో చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సమావేశమందిరంలో ప్రకృతి వ్యవసాయంపై వ్యవసాయ అధికారులు, ఏడీఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యం, అన్ని శాఖల సమన్వయంతో ప్రకృతి వ్యవసాయాన్ని ఈ ఏడాది మరింత విస్తరించాలన్నారు. ప్రకృతిలోని సహజవనరుల ఆధారంగా సాగు చేసే విధానమైన ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్‌పై లోతైన అవగాహన కల్పించడమే ఈ శిక్షణ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో కర్నూలు ఏడీఏ సాలురెడ్డి, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత ఇం'ధన' దందా!

● బినామీలతో హెచ్‌పీ పెట్రో ట్రాన్స్‌పోర్టు
● కన్సార్టియం పేరుతో హంగామా
● 'ఎస్సీ, ఎస్టీ' నిబంధనలకు విరుద్ధం
● జిల్లాలోని 31 బంకులకు పెట్రో ఉత్పత్తుల సరఫరా

కర్నూలు(సెంట్రల్): జిల్లాకు చెందిన ఓ టీడీపీ నేత ఇం'ధన' దందా చేస్తున్నారు. హిందుస్తాన్ పెట్రోల్(హెచ్‌పీ)ను బంకులకు సరఫరా చేసే ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్ట్ నిబంధనలను నిర్వీర్యం చేస్తున్నారు. జిల్లాలో 38 హెచ్‌పీ పెట్రోల్ బంకులు ఉండగా అతని సరఫరా చేసే బంకుల సంఖ్య 31కి చేరింది. త్వరలోనే మిగిలిన బంకులు కూడా అతని ఖాతాలో చేరే అవకాశం ఉంది.

నిబంధనలు ఇవీ..

వైఎస్సార్ జిల్లా భాకరపేట సమీపంలో హెచ్‌పీ పెట్రోల్ స్టాక్ పాయింట్ ఉంది. అక్కడి నుంచి జిల్లా కర్నూలు, కడప, అనంతపురం, నంద్యాల, సత్యసాయి, అన్నమయ్య జిల్లాల్లోని హెచ్‌పీ పెట్రోల్ బంకులకు పెట్రో ఉత్పత్తులను సరఫరా చేస్తారు. కర్నూలు జిల్లాలోని 38 హెచ్‌పీ పెట్రోల్ బంకులు ఉండగా వీటికి స్టాక్ పాయింట్ నుంచి పంపు వరకు పెట్రో ఉత్పత్తులను తెచ్చి ఇచ్చే బాధ్యత కంపెనీకే ఉంటుంది. ఈ క్రమంలో కంపెనీ పబ్లిక్ టెండర్ల ద్వారా ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్ట్ కేటాయిస్తుంది. ఇందులో ఎస్సీ, ఎస్టీలకు 15 శాతం రిజర్వేషన్ ఉంటుంది. పెట్రోల్ బంకులు ఉన్న యజమానులు కూడా పాల్గొనవచ్చు. చివరగా 2020లో ఐదు సంవత్సరాలకుగాను టెండర్లను పిలిచి కేటాయించారు.

దందా ఇలా..

డీలర్లకు దక్కిన టెండర్లపై కల్లూరు మండలంలోని ఓ గ్రామంలో ఉన్న పెట్రోల్ బంకు యజమాని అయిన టీడీపీ నేత కన్ను పడింది. అతను జిల్లాలోనే అతి పెద్ద హెచ్‌పీ డీలర్. నెలకు దాదాపుగా 5 లక్షల లీటర్ల పెట్రో ఉత్పత్తులను విక్రయిస్తాడు. ఈ క్రమంలో అతను కంపెనీ ఇచ్చిన కన్సార్టియం అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ కన్సార్టియం ఏమంటే చిన్న డీలర్‌కు నెలలో 5–6 ట్రక్కుల సరఫరా చేయాలి. అయిదే దీనినే టీడీపీ నేత అవకాశంగా మార్చుకున్నారు. నిబంధలను అతిక్రమించి ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్‌లో ఉన్న వాటితో సహా మొత్తం 31 బంకులకు పెట్రో ఉత్పత్తులను సరఫరా చేసేందుకు అధికారులను బెదిరించారు. మిగిలిన 7 బంకులు కూడా అతని సరఫరా పరిధిలోకే వచ్చేవిధంగా ప్రయత్నాలు చేశారు. ఫలితంగా ఎంతోమంది ప్రైవేట్ ట్రక్కులు ఉన్న కాంట్రాక్టర్లు రోడ్డున పడ్డారు. వారిని నమ్ముకొని ఉన్న వారు ఉపాధిని కోల్పోయారు.

చెప్పింది చేయాల్సిందే!

హెచ్‌పీ ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్ట్‌పై పచ్చనేత పట్టుపెంచుకున్నారు. దీంతో ఆయన చెప్పిందే చేయాల్సిస్తోంది. ఆయన అనుకున్న డీలర్లకే ముందుగా పెట్రోల్, డీజిల్ సరఫరా చేస్తారు. ఆయన చెప్పినట్లు వినకపోతే అవుతలి వారు తీవ్ర పరిణామాలను ఎదుర్కొనేలా చేస్తున్నాడు. ప్రస్తుతం ఆయన పోకడలను చూస్తే ఏదో ఒకరోజు పెట్రో ఉత్పత్తులను కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్‌కు తరలించే అవకాశం ఉంది.

విచారణ చేయాలి..

హెచ్‌పీ పెట్రోల్ సరఫరాలో జరుగుతున్న అక్రమాలు, బినామీలపై పూర్తి స్థాయి విచారణ చేయాలని కొందరు డీలర్లు పట్టుబడుతున్నారు. పచ్చనేత వ్యవహారంపై వారు సీరియస్ అవుతున్నారు. చివరకు ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన కాంట్రాక్ట్‌లను కూడా ఆయనే స్వాధీనం చేసుకున్నారంటే నిబంధనలు ఏ మేరకు అతిక్రమించి ఉంటారో అర్థం చేసుకోవచ్చని, దీనిపై అధికారులు, కంపెనీ మేల్కొనకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని పంపుల యజమానులు పేర్కొంటున్నారు. మరో వైపు కన్సార్టీయం పేరుతో జరిగిన అక్రమాలు కూడా బయటకు వస్తాయని పేర్కొంటున్నారు.

కారు లోపల ఊపిరాడక బాలుడి మృతి


మృతుదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

డోన్ టౌన్: కారు డోర్లు లాక్ అయ్యి ఊపిరాడక అందులో ఉన్న ఈశ్వర్(11) అనే బాలుడు మృతి చెందాడు. ఈ దుర్ఘటన బుధవారం దొరపల్లె గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మోహన్, ధనలక్ష్మీ దంపతుల కుమారుడు ఈశ్వర్ ఆడుకుంటూ ఇంటి ముందు పార్క్ చేసి ఉన్న కారులోకి వెళ్లి డోర్ వేసుకున్నాడు. కొద్ది సేపటి తరువాత డోర్లు లాక్ అయ్యాయి. డోర్ గ్లాస్‌లు పూర్తిగా మూసి ఉండడంతో ఊపిరి ఆడక అచేతనంగా మారాడు. బాలుడు విగతజీవిగా కారులో పడి ఉండటాన్ని తల్లిదండ్రులు గమనించారు. ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

మందగించిన నైరుతి

● జాడ లేకుండా పోయిన వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): ముందస్తుగా ఉమ్మడి జిల్లాలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు ప్రభావం చూపడం లేదు. తొలకరి వర్షాలు కనుమరుగయ్యాయి. ఉష్ణోగ్రతలు మళ్లీ పెరుగుతున్నాయి. బుధవారం ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేసింది. మే నెలలో అధిక వర్షాలు కురిశాయి. నైరుతి రుతుపవనాలు కూడా గత నెల 26న విస్తరించాయి. ఈ ప్రభావం వల్ల ఒకటి, రెండు రోజులు ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. రుతుపవనాలు విస్తరించిన తర్వాత నుంచి వాటిలో చురుకుతనం తగ్గిపోయింది. గాలి తీవ్రత పెరగడంతో వర్షాలు కురుస్తాయో లేదోననే ఆందోళన నెలకొంది. జూన్ నెల మొదటి నాలుగు రోజుల్లో 1 మిమీ వర్షపాతం మాత్రమే నమోదైంది. జూన్ నెల సాధారణ వర్షపాతం 77.7 మి.మీ నమోదు కావాల్సి ఉంది. నల్లరేగడి నేలల్లో ఒకే రోజు లేదా మూడు రోజుల్లో 75 మి.మీ వర్షాలు పడినప్పుడు మాత్రమే పత్తి విత్తనాలు విత్తుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో సాధారణ సాగు 4,22,540 హెక్టార్లు. ప్రధానంగా పత్తి సాధారణ సాగు 2,34,409 హెక్టార్లు ఉండగా.. ఇప్పటి వరకు 5,066 హెక్టార్లలో మాత్రమే విత్తనం పడింది.

పేలిన గ్యాస్ సిలిండర్.. దగ్ధమైన దుకాణాలు



బేకరీ దుకాణంలో మంటలు, కాలిబూడిదైన ఎలక్ట్రికల్ పరికరాలు

ఓర్వకల్లు: వంట గ్యాస్ సిలిండర్ పేలడంతో రెండు దుకాణాలు దగ్ధమయ్యాయి. మంగళవారం అర్ధరాత్రి తర్వాత ఓర్వకల్లులో జరిగిన ఈ దుర్ఘటనలో ఆస్తి నష్టం వాటిల్లింది. బాధితులు, స్థానికుల తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని కెనరా బ్యాంక్ ఎదురుగా దుకాణాలను అద్దెకు తీసుకొని ఉస్తేపల్లి వెంకటేశ్వర్లుశెట్టి, నందికొట్కూరుకు చెందిన శేషఫణి శెట్టి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి తర్వాత వెంకటేశ్వర్లుశెట్టికి చెందిన శ్రీరామబేకరీలో వంట గ్యాస్ సిలిండర్ పేలింది. పక్కనే పున్న రెండు ఫ్రిడ్జ్‌లకు వ్యాపించడంతో అందులోని కూలర్ గ్యాస్‌ను దట్టమైన మంటలు వీచాయి. దీంతో దుకాణంలోని బేకరి వస్తువులు, ఎలక్ట్రానిక్ పరికాలు దగ్ధమయ్యాయి. ఈ మంటలు పక్కనే పున్న శేషఫణిశెట్టికి చెందిన లక్ష్మీ ఎలక్ట్రికల్ దుకాణంలోకి వ్యాపించాయి. అందులోని ఎలక్ట్రానిక్ పరికరాలు, ప్లంబర్ సామాన్లు, ప్లాస్టిక్ పైపులు కాలి బూడిదయ్యాయి. ప్రమాదం కారణంగా బేకరీలో రూ.4 లక్షలు, ఎలక్ట్రికల్ దుకాణంలో రూ.8 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద తీరును పరిశీలించారు.

అంకితభావంతో విధులు నిర్వహిస్తేనే గుర్తింపు


సూర్యనారాయణరెడ్డిని సన్మానిస్తున్న ఇంజనీర్లు

కర్నూలు(అర్బన్): ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసినప్పుడే పదవీ విరమణ తర్వాత కూడా గుర్తింపు లభిస్తుందని పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజనీరు వి.రామచంద్రారెడ్డి అన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండు దశాబ్దాలకు పైగా విధులు నిర్వహించి వైఎస్సార్ కడప జిల్లా బద్వేల్‌లో పీఆర్ డీఈఈగా పదవీ విరమణ పొందిన సూర్యనారాయణరెడ్డిని బుధవారం ఎస్ఈ ఆధ్వర్యంలో పీఆర్ ఇంజనీర్లు ఘనంగా సన్మానించారు. స్థానిక జిల్లా పరిషత్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లోని ఎస్ఈ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఈఈ సి.మద్దన్న, డీఈఈలు రవీంద్రారెడ్డి, బండారు శ్రీనివాసులు, హరిదాసు ఈరన్న, కర్రెన్న, మహేశ్వరరెడ్డి, నాగిరెడ్డి, ఏఈలు విజయభాస్కర్, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఈ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ వివిధ జిల్లాల్లో పనిచేసిన సూర్యనారాయణరెడ్డి ఎంతో అంకితభావంతో విధులు నిర్వహించారన్నారు. ప్రతి ఒక్కరు తమ విధులను ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా సక్రమంగా నిర్వహిస్తే ఎలాంటి సమస్యలు ఉండవన్నారు. ముఖ్యంగా సమయపాలన పాటిస్తూ తమ ఆరోగ్యాలను కూడా కాపాడుకోవాలన్నారు.

క్షేత్రస్థాయి వ్యవస్థలను బలోపేతం చేయాలి


మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): క్లిష్ట పరిస్థితుల్లో మహిళలను ఆదుకునేలా క్షేత్ర స్థాయిలో వ్యవస్థలను బలోపేతం చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో మిషన్ శక్తిలో భాగంగా అమలవుతున్న వన్‌స్టాప్ సెంటర్, మహిళా హెల్ప్‌లైన్, నారీ అదాలత్, శక్తి సదన్‌లపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్ట సమయాల్లో ఉన్న మహిళలను ఆదుకునే వన్‌స్టాప్ సెంటర్లను జిల్లా కేంద్రంలోనే కాకుండా మండల, డివిజన్ కేంద్రాల్లో బలోపేతం చేయాలన్నారు. ఇందుకోసం అంగన్‌వాడీలు, మహిళా పోలీసుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ నిర్మళకు సూచించారు. వన్‌స్టాప్ సెంటర్ అసంపూర్ణంగా ఉండడంతో నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని పీడీ నిర్మళను ఆదేశించారు. మహిళా హెల్ప్ లైన్, నారీ అదాలత్, బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. శక్తి సదన్‌కు సంబంధించి ఒకేషనల్ ట్రెనింగ్ తీసుకున్న మహిళలకు ఉపాధి కల్పించే విధంగా పరిశ్రమల శాఖ సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. అక్కడున్న మహిళలను స్వయం సహాయక గ్రూపుల్లో చేర్పించి స్వయం ఉపాధి యూనిట్లను మంజూరు చేయాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ.. వన్‌స్టాప్ సెంటర ద్వారా సర్వీసు రిజిస్టర్లను కచ్చితంగా నిర్వహించాలని, పరిహార కేసులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు కలెక్టర్ కార్యాలయానికి పంపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అడిషనల్ ఎస్పీ హుస్సేన్‌పీరా, డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతికళ, సెట్కూరు సీఈఓ వేణుగోపాల్, డీఈఓ శామ్యూల్‌పాల్ పాల్గొన్నారు.

సెలవుల్లోనూ స్కూళ్లకు..

● ఉపాధ్యాయులకు తప్పని తిప్పలు

కర్నూలు సిటీ: జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలలకు ఈ నెల 11వ తేదీ వరకు వేసవి సెలవులు ఉన్నాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యా సంస్కరణల పేరుతో సెలవుల్లోనూ స్కూళ్లకు ఉపాధ్యాయులు రావాల్సిందేననే ధోరణితో ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాల సంసిద్ధత కార్యక్రమాలు, సన్నాహక పనుల కోసం అన్ని స్కూళ్లకు చెందిన టీచర్లు క్యాడర్‌తో సంబంధం లేకుండా (గురువారం)నుంచి హాజరుకావాలని డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరం ఈ నెల 12వ తేదీతో ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. సన్నాహక కార్యక్రమంలో మేనేజ్‌మెంట్‌తో సంబంధం లేకుండా అన్ని క్యాడర్లకు చెందిన టీచర్లు హాజరుకావాల్సిందేనని తెలిపారు. వన మహోత్సవం సందర్భంగా అన్ని స్కూళ్లలో మొక్కలు నాటాలని సూచించారు.

విద్యుత్ వైర్లు, స్టార్టర్ బాక్స్‌ల చోరీ


పొలాల్లో విద్యుత్ మోటర్ కేబుల్ వైర్లు చోరికి గురైనట్లు చూపుతున్న రైతులు

హొళగుంద: మండల పరిధిలోని హొన్నూరు క్యాంపునకు (తెక్కలకోట రస్తా) వెళ్లే దారిలోని పొలాల్లో మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు దాదాపు రూ.లక్షకు పైగా విలువైన విద్యుత్ మోటర్ వైర్లు, స్టార్టర్ బాక్స్‌లు ఎత్తుకెళ్లారు. దాదాపు 30కు పైగా మోటర్లకు సంబంధించిన వైర్లను, రెండు స్టార్టర్ బాక్స్‌లను చోరీ చేశారు. విషయం తెలుసుకున్న హొళగుందకు చెందిన తుంగభద్ర రైతు సంఘం అధ్యక్షుడు సిందువాళ కృష్ణయ్య, రైతులు గిరిమల్ల, లక్ష్మన్న, అబ్దుల్ సుభాన్ తదితరులు చోరీ జరిగిన పొలాలను పరిశీలించారు. ఈ కేబుల్ వైర్ మీటర్ రూ.100కు పైగా ధర ఉంటుందని ఒక్కో బోరు వద్ద 20 మీటర్లకు పైగా వైర్లును కత్తిరించారని రైతులు తెలిపారు. వెంటనే దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు.